క్లుప్తంగా

ఎములాడ రాజన్నకు రూ.10లక్షల విరాళం



కోడె మొక్కు చెల్లించుకుంటున్న వెలిచాల రాజేందర్‌రావు

వేములవాడ: వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు రూ.10లక్షల విరాళాన్ని గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.

ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే 'కవ్వంపల్లి'

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలకేంద్రంలోని గంగాధర క్షేత్రంగా పేరుగాంచిన శివాలయంలో గురువారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ గంగాధర క్షేత్రం వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు కాంగ్రెస్ నాయకులు బొంపల్లి రాఘవ రెడ్డి, పసుల వెంకటి, అంతగిరి విజయ్, బాలపోచయ్య, ఒగ్గు రమేశ్, సంజీవ్, బాలరాజు, కరుణాకర్, జమాల్, సురేందర్ రెడ్డి, ప్రసాద్, రాకేష్, ఉస్మాన్, శ్రీనివాస్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లికి చెందిన తోట సత్తవ్వ, కుమారుడు తోట హరీశ్ కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. వారి ఆర్థిక పరిస్థితిని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన విప్ సత్తవ్వకు రూ.2.50 లక్షలు, హరీశ్‌కు రూ.2.50 లక్షలకు ఎల్‌వోసీ మంజూరు చేయించారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఫిరోజ్ పాషా గురువారం తెలిపారు. బాధితులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

రుద్రంగి: మండలకేంద్రంలో లక్ష్మీ నర్సింహ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. మహిళలు డప్పు చప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు చెలుకల గంగాధర్, ఆకుల గంగాధర్, గణేశ్, కాల్వ అనిల్, సాయి, చిన్నా రెడ్డి, తిరుపతి, మహేశ్, పెద్దఎత్తున మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

తంగళ్లపల్లి: రైతులకు నాసిరకం విత్తనాలు, పురుగుల మందులు విక్రయించవద్దని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని ఎంపీపీ పడిగెల మానస అన్నారు. గురువారం మండలంలోని పద్మనగర్ గ్రామంలో ఫర్టిలైజర్ సీడ్స్ దుకాణాన్ని ఆమె ప్రారంభించారు. సిరిసిల్ల సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, ఎంపీటీసీ కుంటయ్య, నాయకులు రాజయ్య, సావనపెల్లి బాలయ్య, భాస్కర్ రెడ్డి, సీఈవో నరేష్, రైతులు పాల్గొన్నారు.

అందుబాటులో పత్తి విత్తనాలు

బోయినపల్లి: మండలకేంద్రంతో పాటు, పలు గ్రామాల్లోని విత్తన దుకాణాల్లో పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఎంఏవో ప్రణీత పేర్కొన్నారు. గురువారం బోయినపల్లి తదితర గ్రామాల్లో విత్తన దుకాణాలు తనిఖీ చేశారు. మండలంలోని 9 మంది డీలర్ల వద్ద 7519 పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉండగా, అందులోంచి 418 ప్యాకెట్లు రైతులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత

కోనరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో పదో తరగతిలో మెరిట్ సాధించిన గౌడ విద్యార్థినులు నందగిరి దీప్తి (పల్లిమక్త), పల్లి రిత్విక (సుద్దాల)కు రూ.2వేలు, రూ.1500 చొప్పున మండల గౌడ సంఘం అధ్యక్షుడు అబ్బసాని శంకర్ గౌడ్ నగదు ప్రోత్సాహకాలు గురువారం అందజేశారు. గౌడ సంఘం నాయకులు తీగల రవీందర్ గౌడ్, నందగిరి తిరుపతి గౌడ్, వెంకన్న గౌడ్, తాళ్లపల్లి తిరుపతి గౌడ్, శ్రీకాంత్ గౌడ్, వెంగలి దేవయ్య గౌడ్, అంజయ్య గౌడ్, నందయ్య గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రాజన్న సేవలో పట్టభద్రులు

- స్వచ్ఛందంగా హుండీసేవలో..
- మండుతున్న ఎండలను లెక్క చేయకుండా సొంత ఖర్చులతో ఆలయం చెంతకు



రాజన్న హుండీ లెక్కింపులో భ్రమరాంబిక సేవా సమితి సభ్యులు

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో జరిగే హుండీ లెక్కింపులో సుదూర ప్రాంతాల నుంచి పట్టభద్రులైన యువతులు సైతం తమ సొంత ఖర్చులతో మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా పరమేశ్వరుడి సేవలో తరిస్తున్నారు. గురువారం జరిగిన హుండీ లెక్కింపుకు భ్రమరాంబిక సేవాసమితికి చెందిన దాదాపు 250 మంది మహిళలు స్వచ్ఛందంగా సేవలందించారు. ఇందులో చాలామంది యువకులు, పట్టభద్రులైన వారు సైతం ఉన్నారు. వేకువజామునే ఐడీకార్డులు, డ్రెస్‌కోడ్‌తో చేరుకుని స్వామివారి ఓపెన్ స్లాబ్‌లో జరిగే హుండీ లెక్కింపులో స్వచ్ఛందంగా పాల్గొని సేవలందిస్తున్నారు. వీరి సేవలకు రాజన్న భక్తులు అభినందిస్తున్నారు.

వరంగల్ నుంచి వచ్చాను



నేను ఎంటెక్ పూర్తి చేశాను. వరంగల్ జిల్లా నుంచి రాజన్నకు ఉచితం సేవలందించాలనే ఉద్దేశంతో వచ్చాను. ఎంతో ఆనందంగా ఉంది. యువతలోనూ భక్తిభావం పెంపొందించాలన్న తలంపుతో రాజన్న హుండీ లెక్కింపులో పాల్గొన్నాను.

– ప్రవళిక, ఎంటెక్, వరంగల్

మొదటిసారి హాజరయ్యా..



మాది హన్మకొండ. నేను మొదటిసారి వేములవాడ రాజన్న హుండీ లెక్కింపులో పాల్గొన్నా. సనాతన ధర్మం కాపాడుకునేందుకు నేను స్వచ్ఛదంగా రాజన్నకు సేవ చేయాలని వచ్చా. నిజంగా రాజన్నకు సేవచేసే అవకాశం లభించడం అదృష్టం.

– మహేశ్వరి, బీటెక్, హన్మకొండ

సేవలకు గుర్తింపు ఇస్తాం

వేములవాడ రాజన్న హుండీ కౌంటింగ్‌లో గురువారం 250కిపైగా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఫ్రీగా సేవలందించడం, మండుతున్న ఎండలకు సైతం లెక్కచేయకుండా ఇక్కడికి రావడం ఆనందంగా ఉంది. త్వరలో వీరి సేవలకు గుర్తింపు ఇచ్చేందుకు కృషి చేస్తా.

– రామకృష్ణ, ఈవో

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

చందుర్తి: ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. గురువారం చందుర్తి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సిబ్బందికి కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. గ్రామాల్లో దొంగతనాలను అరికట్టేందుకు పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. సిబ్బంది విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రజలతో సంబంధాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట చందుర్తి సీఐ గాండ్ల వేంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు కానిస్టేబుల్

సిరిసిల్లక్రైం: ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు సిరిసిల్ల టౌన్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న లక్ష్మణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆకాంక్షించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో కానిస్టేబుల్‌కు స్పోర్ట్స్ యూనిఫాం అందించారు. సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు షీల్డ్ అందిస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

చందుర్తి: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని, యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజక వర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. మండలంలోని మల్యాల గ్రామంలో ఈర్లపల్లి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ ప్రీమియం లీగ్ సీజన్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. విన్నర్‌గా నిలిచిన కోనరావుపేట జట్టుకు రూ.20వేల నగదు, షీల్డ్‌ను, రన్నర్‌గా నిలిచిన మల్యాల జట్టుకు రూ.10వేల నగదుతో పాటు షీల్డ్‌ను లక్ష్మీనరసింహరావు చేతుల మీదగా క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఈర్లపల్లి రాజు, పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అబ్రహం, మండల కోఆప్షన్ సభ్యులు కమలాకర్, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ రమేశ్‌రావు, నాయకులు శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

'క్షయ' నివారణకు ప్రత్యేక చర్యలు



ముస్తాబాద్: క్షయవ్యాధి నివారణకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వైద్యాధికారి గీతాంజలి తెలిపారు. మండలంలోని మద్దికుంట ఆరోగ్య ఉపకేంద్రంలో గురువారం క్షయవ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ క్షయవ్యాధి ఒకరి నుంచి మరొకరికి సోకుతుందన్నారు. అనుమానితుల నుంచి నమూనాలను స్వీకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నామన్నారు. విపరీతమైన దగ్గు, జ్వరం ఇతర లక్షణాలు ఉన్న వారు వెంటనే సమీపంలోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకుంటూ వ్యాయామం చేయాలన్నారు. టీబీ నోడల్ సూపర్‌వైజర్ లక్ష్మీప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఏఎన్‌ఎం విజయ నిర్మల, ఆశాకార్యకర్తలు జమున, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్ల: పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ 'సెస్' ఏఈ మధుకర్ గురువారం తెలిపారు. సిరిసిల్లలోని 220/132/33 కేవీ ట్రాన్స్‌కో విద్యుత్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పట్టణ శివారులోని చంద్రంపేట, రగుడు, బోనాల, ముష్టిపల్లి, పెద్దూరు, సర్దాపూర్ ప్రాంతాల్లో ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మధుకర్ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

స్వయం ఉపాధిలో రాణించాలి

రుద్రంగి: యువత స్వయం ఉపాధితో ముందుకెళ్లాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో నలుమాచు రాజు అనే యువకుడు ఏర్పాటు చేసిన మెడికల్ ఏజెన్సీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, తర్రె లింగం, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బైరి గంగ మల్లయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గండి నారాయణ, నాయకులు ఇప్ప మహేశ్, తదతరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే సమాచారమివ్వాలి



మాట్లాడుతున్న సీఐ వేంకటేశ్వర్లు

చందుర్తి: విత్తనాల కొనుగోళ్లల్లో రైతులు మోసపోవద్దని సీఐ వేంకటేశ్వర్లు అన్నారు.మండలంలోని ఎన్గల్‌లో గురువారం రాత్రి పోలీసు మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసి విత్తనాలకు దుకాణదారుల నుంచి బిల్లులు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండి, ఎక్కడైనా నకిలీ విత్తనాలను విక్రయించే తమకు సమాచారాన్ని ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో రైతులు పొలాల వద్దకు వెళ్లినప్పుడు, ఉరుములు, పిడుగులు పడే సమయంలో చెట్ల కిందకు వెళ్లవద్దన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్ , సిబ్బంది ఉన్నారు.

పరామర్శ



వేములవాడ: రాజన్న ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశం ఈనెల 27న అనారోగ్యంతో మృతిచెందాడు. ఈవో రామకృష్ణ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఏఈవో ప్రతాప నవీన్, పర్యవేక్షకుడు ఎడ్ల శివ, శ్రీనివాస్, హరిహర నాథ్ తదితరులున్నారు.

మూతబడిన వాటర్‌ప్లాంట్

- ఆరు నెలలుగా గ్రామస్తుల ఇబ్బందులు



శివంగాలపల్లిలో మూతబడిన వాటర్‌ప్లాంట్

కోనరావుపేట: ఓవైపు ఎండలు మండిపోతున్నాయి. గ్రామంలోని ఒకే ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు శివంగాలపల్లి గ్రామస్తులు. తాగునీటికోసం వారు కోనరావుపేట మండలకేంద్రానికి వెళ్లి తెచ్చుకుంటున్నారు. సుమారు పదేళ్ల క్రితం శివంగాలపల్లిలో అప్పటి ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు సేఫ్ సంస్థ ద్వారా ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. చాలా ఏళ్లు కావడంతో మిషనరీలు పాడయ్యాయి. దీంతో నీరు శుద్ధి కావడంలేదు. కొన్నిరోజులు శుద్ధి చేయని నీరే సరఫరా అయింది. అప్పట్నుంచి ప్లాంట్‌ను ఎవరూ పట్టించుకోవడం లేదు. గ్రామస్తులు సుమారు 2 కిలోమీటర్ల దూరాన ఉన్న కోనరావుపేట మండలకేంద్రానికి వెళ్లి నీటిని క్యాన్లలో తెచ్చుకుంటున్నారు. గ్రామంలో సుమారు 200 కుటుంబాలుండగా, జనాభా 900 వరకు ఉంటుంది. ఓటరు లిస్ట్ 674 ఉంది. వాటర్‌ప్లాంట్ పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండలు మండుతుండటంతో నీటి అవసరం మరింత ఎక్కువైంది. దూర ప్రాంతం వెళ్లి నీటిని తెచ్చుకోలేక, తీసుకువచ్చిన నీరు సరిపోక అవస్థలు పడుతున్నారు. అయితే గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి పదేళ్ల పైనే అవుతోందని, ఎన్నికల కోడ్‌తో ఎవరూ పట్టించుకోలేదని మాజీ సర్పంచ్ శివంగాల సురేశ్‌యాదవ్ తెలిపారు. ఎన్నికల కోడ్ ముగియగానే దాతల సహకారంతో గ్రామంలో ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరుతామని, తాగునీటి సమస్యను పరిష్కరించుకుంటామని పేర్కొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

వీర్నపల్లి: మండలకేంద్రంలో జూన్ 1న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గురువారం ఎస్సై రమేశ్ అన్నారు. ఉదయం 8గంటలకు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించే వైద్యశిబిరంలో వివిధ రకాల పరీక్షలు చేస్తారన్నారు. మండలంలోని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు, వైద్యశిబిరానికి వచ్చేవారికి ఉచితంగా రవాణా సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు.

సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు

కోనరావుపేట: మండలకేంద్రంలో సీఐటీయూ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షుడు లోకుర్తి రాజు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి మాట్లాడారు.

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లి–బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కు గేటు ఎదుట టెక్స్‌టైల్ పార్కు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్ ఆధ్వర్యంలో సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు జెల్ల సదానందం, ఆడెపు శుభోశేఖర్, సుకంటి మహేశ్, కనకయ్య, రమేశ్, శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో వార్షికోత్సవ వేడుకలను గురువారం వేద పండితులు ఘనంగా ప్రారంభించారు. గురువారం నుంచి శనివారం వరకు వేడుకలను నిర్వహించనున్నారు. మొదటి రోజు స్వస్తివాచనం, గణపతి పూజ, రుత్విగ్వరణం, అఖండ దీపారాధన, దేవాతాహ్వానం, ప్రధాన కలశస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు గుండయ్య శర్మ, ఆలయ కమిటీ సభ్యులు మురళి, భాస్కర్, మధు, సుధాకర్, గంప నాగేందర్, రాజు, ఆంజనేయులు, మహిళలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారంకు చెందిన కొడిమోజు పోచయ్య అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. గురువారం పోచయ్య పార్థివ దేహానికి నివాళి అర్పించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

పైపులైన్ లీకేజీ.. వృథాగా 'భగీరథ' నీరు



ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్‌లో గురువారం మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కాగా తాగునీరంతా రోడ్డుపై వృథాగా పోయింది. సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న భగీరథ పైపులైన్ లీక్ కావడంతో రహదారిపై వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పైపులైన్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే భగీరథ పైపులు గ్రామాల్లో లీకేజీ అవుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు అండగా ఉండాలి



ధర్మేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ముస్తాబాద్: కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన తోట ధర్మేందర్‌ను పోతుగల్ గంగపుత్ర సంఘం గురువారం ఘనంగా సన్మానించింది. గల్ఫ్‌లో మోసపోతున్న కార్మికుల కుటుంబాలకు అండగా ఉండాలని గంగపుత్ర సంఘం నాయకులు కోరారు. ప్రభుత్వపరంగా గల్ఫ్ కార్మికులకు వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ ఇప్పించి, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. గల్ఫ్ ఏజెంట్ల మోసాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పారిపెల్లి శ్రీనివాస్, సంఘం అధ్యక్షుడు జగన్‌మోహన్, పాక అంజయ్య, పాక బాలయ్య, మిద్దె నర్సయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విరాసత్ చేయండి సారూ..!



మాట్లాడుతున్న ముత్తవ్వ

ముస్తాబాద్: తన భర్త మృతిచెందటంతో అతని పేరిట ఉన్న వ్యవసాయ భూమిని కుమారుడి పేరిట విరాసత్ చేయాలని మండలంలోని తెర్లుమద్దికి చెందిన బైతి ముత్తవ్వ అధికారులను వేడుకుంది. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ముత్తవ్వ గురువారం మాట్లాడుతూ.. నెలల తరబడి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా కిందిస్థాయి సిబ్బంది రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. అనారోగ్యంతో తాను ఎండలో కార్యాలయం వరకు రావడం ఇబ్బందిగా ఉందని తెలిపింది. దీనిపై సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆమె వాపోయింది. ఈ విషయమై తహసీల్దార్ సురేశ్‌ను వివరణ కోరగా బైతి ముత్తవ్వ విరాసత్ విషయం తన దృష్టికి రాలేదని, వెంటనే విచారణ చేపట్టి ఆమెకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు.


మురుగు కాలువలోంచి పైపులు తొలగించారు..!

సాక్షి స్పందన



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌లో మురుగు కాలువల్లో ఉన్న తాగునీటి పైపులను గురువారం పంచాయతీ అధికారులు తొలగించారు. గ్రామంలో కొంత కాలంగా మురుగుకాలువల్లో తాగునీటి పైపులు ఉండడంతో ప్రజలు కలుషిత నీటితో అనారోగ్యం బారినపడుతున్నారు. దీనిపై గురువారం 'సాక్షి' లో 'మురుగు కాలువల్లోనే తాగునీటి పైపులు'అనే శీర్షికన కథనం ప్రచురితం కాగా పంచా యతీ కార్యదర్శి సంతోష్, ఇతర అధికారులు స్పందించి మురుగులో ఉన్న పైపులను తొలగించారు.

ఘనంగా మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు



సిరిసిల్ల: గాంధీచౌక్‌లో కేక్ కట్‌చేస్తున్న నాయకులు

సిరిసిల్ల/ఎల్లారెడ్డిపేట/చందుర్తి: రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంతోపాటు మండలకేంద్రాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. సిరిసిల్లలోని గాంధీచౌక్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని డే కేర్ కేంద్రంలో మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. చందుర్తి మండలం రామన్నపేటలో పార్టీ జిల్లా నాయకుడు భీంరాజు కనుకరాజు ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు జరిపారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాయకులు సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, సూర దేవరాజు, ఆకునూరి బాలరాజు, గోలి వెంకటరమణ, మ్యాన ప్రసాద్, బొప్ప దేవయ్య, గుండ్లపల్లి రామానుజం, కుడిక్యాల రవికుమార్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలోనే చేరండి



నారాయణపూర్‌లో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని అధ్యాపకులు గురువారం మండలంలోని పదిర, రాగట్లపల్లి, నారాయణపూర్ గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అన్ని వసతులతో ఉచిత విద్యను అందిస్తున్నామన్నారు. నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విశాలమైన గదులు, ఉచిత పుస్తకాలు, పోటీ పరీక్షలకు అనుగుణంగా బోధన, ఉపకార వేతనాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పర్శరాములు, కొడిముంజ సాగర్, తదితరులు పాల్గొన్నారు.